క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాజేడు: మండలంలో పోలీసులు గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. పేరూరు ఎస్సై రమేష్ కృష్ణాపురం గ్రామ సరిహద్దులో జాతీయ రహదారిపై తనిఖీ చేయగా, వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు జగన్నాథపురం జంక్షన్ వద్ద తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఘనంగా తీజ్ వేడుకలు



మహాముత్తారం: మండలంలోని నిమ్మగూడెం గ్రామంలోని తండాలో గురువారం లంబాడీలు తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. వారి కులదేవతలకు ప్రత్యేక పూజలు చేసి సాంప్రదాయ దుస్తులతో మహిళలు దాండియా ఆడారు. తండాలో మ హిళలు, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా బండి నడిపితే చర్యలు



గణపురం: వాహనదారులు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై మచ్చ సాంబమూర్తి హెచ్చరించారు. గురువారం నంబర్ ప్లేట్ లేని పలు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి కారణాల చేతనైన వాహనాలకు ముందు, వెనుక భాగాంలో నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డు పైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడుంబా స్వాధీనం

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి గ్రామాల్లో గురువారం పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి పంగిడిపల్లిలో 5లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పంగిడిపల్లి గ్రామానికి చెందిన గందం బాలకొమురు అనే వ్యక్తి అక్రమంగా గుడుంబాను విక్రయిస్తుండగా గుడుంబాను స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో పాల్గొన్న వారిలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సంపత్, ఉమెన్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

రాజీనామా



మొగుళ్లపల్లి: మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, స్థానిక ఎంపీటీసీ దండ వెంకటేశ్వరరెడ్డి తోపాటు గ్రామ ఉప సర్పంచ్ మాదం రాజయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కె.సునీల్‌రెడ్డి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఎంపీటీసీ పదవికి కూడా రాజీనామా చేసినట్లు తెలిపారు. గ్రామంలో తన గౌరవాన్ని దెబ్బతీసేలా బీఆర్ఎస్ నాయకులు ప్రవర్తిస్తున్నారని అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు పోరాటం చేయాలి



భూపాలపల్లి రూరల్: ప్రజాస్వామ్య తెలంగాణ సాధన కోసం ప్రజలు పోరాటం చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల వేదిక జిల్లా కన్వీనర్ కర్నాటకపు సమ్మయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్నాటకపు సమ్మయ్య, రైతు వేదిక నాయకులు కామెర గట్టన్న, మారేపల్లి మల్లేశం మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ దొరల గడీల పాలన కింద నలిగిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. దోపిడీ పాలనను అంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీక కిరణ్, రత్నం కిరణ్, చల్లగురుగుల సంజీవ్, యుగేందర్, యాస నర్సయ్య, వావిలాల లక్ష్మణ్, అక్కల బాపు, లింగమల్ల సడవలిరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది దుర్మార్గపు వైఖరి

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



మంగపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

మంగపేట: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిలిపేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడం దుర్మార్గపు చర్య అని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని మల్లూరులో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో గురువారం గ్రామాల వారీగా ఆయన రహస్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిలిపేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత బట్టి విక్రమార్క ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీని ఓడించి బుద్ధి చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల ఎన్నికల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు వత్సవాయి శ్రీధర్వర్మ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేశ్, వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, రైతుబంధు జిల్లా సభ్యుడు పచ్చా శేషగిరిరావు, పాదెం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల క్షేత్రంలోని స్వయంభు లక్ష్మీనర్సింహాస్వామిని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ రోడ్లు భవనాల శాఖ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి సారిగా ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వయంభు స్వామివారికి వారి గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టతను, ఆలయ పురాణాన్ని వివరించి స్వామివారు, అమ్మవార్ల శేషవస్త్రాలను బహూకరించి వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ ముకుందం, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మినారాయణ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డికి లక్ష్మీనర్సింహస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు పాదెం క్రిష్ణప్రసాద్, శ్రీధర్‌వర్మ, తోట రమేష్, సమ్మయ్య ఉన్నారు.

బీఆర్ఎస్‌కు శివసత్తుల సంఘం మద్దతు



పూజలు చేస్తున్న శ్రీనివాసరెడ్డి, మెట్టు శ్రీనివాస్

ములుగు: వచ్చే ఎన్నికల్లో ములుగు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామని శివసత్తుల సంఘం జిల్లా అధ్యక్షురాలు వసంత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని, రోడ్డు రవాణా శాఖ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రదీప్‌రావు, బాబురావు, రవీందర్, శ్రీనివాసరావు, పురుషోత్తం, సమ్మయ్య, తిరుపతమ్మ, హైమ, సంధ్య, దివ్య, జ్యోతి పాల్గొన్నారు.

రూ.లక్ష కొట్టు.. ఉద్యోగం పట్టు!

- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ పోస్టుల భర్తీలో అవినీతి



ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం

ఏటూరునాగారం: చదువుతో సంబంధం లేదు రూ.లక్ష ఉంటే ఐటీడీఏలో ఉద్యోగం పొందవచ్చు. డిగ్రీలు, బీఈడీలు ఉన్నా చెత్తకుండీలో వేయాల్సిందే. తెల్ల పేపర్‌పైన క్వాలిఫికేషన్ రాసి జాబ్‌లో జాయిన్ కావొచ్చు ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖలో జరుగుతున్న జాబ్ రిక్రూట్‌మెంట్ తీరు ఇది. ఈ విధంగా రిక్రూట్‌మెంట్ చేస్తున్నా ఐటీడీఏ ఉన్నాతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం విడ్డూరం. ఏటూరునాగారం ఐటీడీఏలో 23 మందిని సెలెక్ట్ చేస్తే పీఓ, డీడీల వద్ద ఒక్క అభ్యర్థికి చెందిన పూర్తి సమాచారం, అప్లికేషన్, జిరాక్స్ సెట్టు లేదు. కమిషనర్ నుంచి వచ్చిన ఆర్డర్‌ను బేఖాతర్ చేస్తూ వారికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకుండా ఉద్యోగంలో డీడీ పోచం పోస్టులను భర్తీ చేశారు. ఏటూరునాగారం ఐటీడీఏ పరిధి ములుగు, వరంగల్, భూపాలపల్లి, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ జిల్లాలోని 30 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఆర్సీ నంబర్ డీ3/2455/2021/26/10/2022న కమిషనర్ హైదరాబాద్ 48 కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేశారు. అందులో 23 మందికి ఎలాంటి నోటిఫికేషన్, సీనియార్టీ లేకుండా ఐటీడీఏ అధికారులు ఒక్కో పోస్టుకు రూ.1లక్ష తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే ఎంపిక చేసి ఆయా జిల్లాలకు పంపినట్లు పలు గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి. మిగిలిన పోస్టులను ఈ నెల 7న కొత్తగా నోటిఫికేషన్ జారీ చేసి 15 పోస్టులు ప్రకటించారు. కానీ కమిషనర్ జారీ చేసిన పోస్టులను పక్కన పెట్టి దొడ్డి దారిన ఎంపిక చేయడం సరికాదని నాయకులు మండిపడుతున్నారు. 48 పోస్టులను గిరిజనులకే సీనియార్టీ ప్రకారం భర్తీ చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా అధికారులు కుమ్మక్కై 23 పోస్టులను ఎంపిక చేసినట్లు ఆరోపిస్తున్నారు. తక్షణమే దొడ్డి దారిన భర్తీ చేసిన 23 సీఆర్టీ పోస్టుల లిస్టును రద్దు చేసి, సీనియార్టీ ప్రకారం మంజూరై పోస్టులను సబ్జెక్టుల వారీగా మళ్లీ ఎంపిక చేయాలని ఉమ్మడి వరంగల్ జల్లా గిరిజన సంఘాలు, నిరుద్యోగులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

పథకాలు ఆపాలని కుట్ర



మాట్లాడుతున్న దండుగుల మల్లయ్య

ఎస్ఎస్ తాడ్వాయి: రైతు బంధు, దళిత బంధు పథకాలు ఆపాలని కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నిందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతులకు రైతు బంధు డబ్బులు ఖాతాల్లో పడాల్సి ఉండగా ఏఐసీసీ ఇన్‌చార్జ్ మాణిక్రావు ఠాక్రే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అనాలోచిత పనులకు ఒడికట్టి గత కొన్ని సంవత్సరాలుగా అమలవుతున్న రైతు బంధు పథకాన్ని నిలిపివేయాలని, దళితులకు ప్రయోజకరమైన దళిత బంధు పథకాన్ని నిలిపివేసేందుకు కుట్రలు చేయడాన్ని సమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రామసాయం శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు డేగల సలేందర్, పార్టీ సీనియర్ నాయకులు బండారి చంద్రయ్య, సిద్ధబోయిన వసంతారావు, శేషగిరి, బాలరాజు, రవి, లక్ష్మయ్య, శోభన్, కృష్ణ, విజయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దు



ప్రజలకు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన సీఎం కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలను ఎన్నికల్లో చెబుతున్న కల్లిబొల్లి మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. గురువారం మండలంలోని కాల్వపల్లిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సెల్ మండల అధ్యక్షుడు యాశాడపు మల్లయ్య మాట్లాడుతూ..రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఒకసారి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా నాయకులు పురుషోత్తం నర్సింహులు, మాజీ సర్పంచ్ కుడుముల సారయ్య, యూత్ మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, కొప్పుల కార్తీక్, సిద్ధబోయిన నర్సింగరావు, ఓదెలు, రాముల, శ్రావణ్ పాల్గొన్నారు.

పాఠశాలలో అల్పాహారం ప్రారంభం



అల్పాహారం వడ్డిస్తున్న వంట సిబ్బంది

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు రఘుపతి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధనల ప్రకారం విద్యార్థులకు రుచికరమైన, శుభ్రమైన, నాణ్యతతో కూడిన అల్పాహారం పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచందర్ రావు, పాఠశాల చైర్మన్ గుర్రం అశోక్, ఉపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, బొమ్మ రాజమౌళి, ఉస్మాన్, సరళాదేవి, నీలిమారెడ్డి, రామనారాయణ, బుర్ర సదయ్య, సుజాత, విజయలక్ష్మీ, కల్పన, శంకర్, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఓటేసి ఆదరిస్తే అభివృద్ధి చేస్తా..



మహాముత్తారం: మాట్లాడుతున్న పుట్ట మధు

మహాముత్తారం: వచ్చే ఎన్నికల్లో తనును బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఓటేసి ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. తనకు నాలుగేళ్లు ఎమ్మెల్యే అవకాశం ఇస్తే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని తన తల్లి పుట్ట లింగమ్మ ట్రస్టు పేరిట అభివృద్ధి కార్యక్రమాలతోపాటు 200 జంటలకు పెళ్లిళ్లు చేశానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలతోపాటు తాను సొంతగా మేనిఫెస్టో రూపకల్పన చేశానని దానిని ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అమలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శాంతకుమార్, మహాముత్తారం ఎంపీటీసీ సురేష్, ములుగుపల్లి సర్పంచ్ దూలం మల్లయ్య, మార్క రాము, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ పట్టు మధు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోతో పాటు తన సొంత మేనిఫెస్టోను నియోజవర్గంలో అమలు చేస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో సొంతగా రెండు హాస్టళ్లు నిర్వహించి పేద విద్యార్థులందరికీ ఉన్నత చదువుతో పాటు ఉద్యోగాలు వచ్చేవరకు ఉంచితంగా వసతి ఏరాటు చేస్తా అని అన్నారు. బొమ్మపూర్, అన్నారం, రాపెల్లికోట, గ్రామలకు చెందిన 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా ఆహ్వానించారు. కాటారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యల మమత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాంపల్లి శ్రీనివాసరావు, పలిమెల మండల అధ్యక్షుడు తిరుపతి, సర్పంచ్ శ్రీపతిబాపు, తిరుపతిరెడ్డి, అన్నారి ప్రకాశ్, అలీమ్, రాకేష్, మహిళ నాయకులు గీతబాయి, కుంభంపద్మ ఉమ్మడి మండలల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి

కన్నాయిగూడెం: మండలంలోని పోలింగ్ బూత్‌లకు కావాల్సిన మౌలిక వసతులను వెంటనే సమకూర్చుకోవాలని ములుగు అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. మండల పరిధి వివిధ గ్రామాల్లో ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను గురువారం అడిషనల్ కలెక్టర్ తనిఖీ చేశారు. తుపాకులగూడెంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి తక్షణమే కావాల్సిన విద్యుత్, వాటర్, మరుగుదొడ్లు, మొదలైన వసతులను ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ సలీమ్, ఎంపీటీఓ పనిచంద్రకు సూచించారు. పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వీరివెంట రెవెన్యూ డీటీ సర్వర్ పాషా, ఆర్ఐ గణేశ్, ఎంపీఓ రామకృష్ణ సిబ్బంది ఉన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి



నిందితులను చూపుతున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధి ముకునూరు పాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ 4 వేలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

నాయకుల ఇంటింటా ప్రచారం

మహాముత్తారం: మండలంలో వారం రోజుల నుంచి మండలంలోని నర్సింగాపూర్, ములుగుపల్లి, పోలారం, మహాముత్తారం, పోలంపల్లి, రేగులగూడెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా తిరుగుతూ ఆరు గ్యారెంటీలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి శ్రీధర్‌బాబును గెలిపించాలని గురువారం రేగులగూడెంలో నాయకులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి దేవేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పక్కల నడువలి, మండల ప్రచార కార్యదర్శి సకినాల రాజు, కాంగ్రెస్ నాయకులు లింగమల్ల దుర్గయ్య, నడువలి, తూటి పుల్లారెడ్డి, రంగె రవీందర్ పాల్గొన్నారు.

నియామకం

మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన పక్కల రాజబాపును బీఆర్ఎస్ మహాముత్తారం మండల ప్రచార కమిటీ కన్వీనర్‌గా నియమించారు. నియామకపత్రాన్ని గురువారం పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు అందజేశారు. అదే విధంగా ప్రచార కమిటీ కోకన్వీనర్‌గా మండలంలోని స్థంబంపల్లి గ్రామానికి చెందిన మోత్కూరి చంద్రశేఖర్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శాంతకుమార్, రైతు సమితి అధ్యక్షుడు మార్క రాము, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాదారపు స్వామి తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి

పలిమెల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 25 మందికి తగ్గకుండా కూలీలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సునీత, ఈసీ శ్రీకాంత్, టీఏలు ప్రశాంత్, సదాశివుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, మదన్, సల్మాన్, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీరామ్, మల్లయ్య, సీఓ షారుఖ్‌ఖాన్ పాల్గొన్నారు.

నాటుసారాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఏటూరునాగారం: తెలంగాణలోకి నాటు సారా, అక్రమ మద్యాన్ని తీసుకురాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ములుగు, భూపాలపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో తెలంగాణ సరిహద్దు ఎక్సైజ్ జిల్లా అధికారులు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఎక్సైజ్ అధికారులతో కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, నాటుసారా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే.. స్థానిక అధికారులు బెల్ట్ షాపులు, అక్రమ మద్యం, మత్తు పదార్థాలపై దృష్టి పెట్టి తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని పాటించాలని, ఎవరు ఉల్లంఘించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ లింగాచారి, ఏటూరునాగారం సీఐ ఫకీరా, కాటారం సీఐ ప్రశాంతి, డీటీఎఫ్ సీఐ రాజ సమ్మయ్య, ఎస్సై వెంకన్న, మహారాష్ట్ర ఎక్సైజ్ అధికారులు షేక్, భగత్, గోజీబీ, ఛత్తీస్‌గఢ్ అధికారి రతన్ చౌదరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో ప్రజాప్రతినిధుల చేరిక



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వెంకటాపురం(కె): మండలంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీటీసీ పాయం రమణ, మరికాల సర్పంచ్ వాసం సత్యవతి, బెస్తగూడెం సర్పంచ్ చిడెం లాలిబాబు, ఉపసర్పంచ్ మంచర్ల భిక్షపతి, బీసీ మర్రిగూడెం సర్పంచ్ అట్టం సత్యవతి, ఉపసర్పంచ్ ఝాన్సీ రాణి, నూగూరు సర్పంచ్ లలిత, మొర్రవాని గూడెం సర్పంచ్ మడకం సారయ్య, రాచపల్లి సర్పంచ్ స్వర్ణం సమ్మయ్య, బర్లగూడెం ఎంపీటీసీ కురసం సమ్మక్కలకు పార్టీలో చేరారు. వారి లక్ష్మీనారాయణ కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సీనియర్ నాయకులు చిడెం మోహన్ రావు తదితర్లున్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న జవహర్‌లాల్

వెంకటాపురం(ఎం): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకు తీసుకవెళ్లి ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ అన్నారు. గురువారం మండలంలోని పాలంపేట, కేశవపూర్ గ్రామాల్లో బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపి గిరిజన మోర్చా అధికార ప్రతినిధి తాటి కృష్ణ, నాయకులు సుమన్‌రావు, రఘు, తిరుపతి ఉన్నారు.

మేడిగడ్డ బ్యారేజీపై విచారణ చేపట్టాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి వద్ద నిర్మించిన మేడిగడ్డ(లక్ష్మి)బ్యారేజీ పిల్లర్లు కుంగిన ఘటనలో ఉన్నత న్యాయస్థానం ద్వారా విచారణ చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. గురువారం పిల్లర్లు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించడానికి వస్తున్న నారాయణ బృందాన్ని పోలీసులు అంబట్‌పల్లి వద్ద అడ్డుకున్నారు. కొంతసేపు వాగ్వాదం జరిగిన అనంతరం పోలీసులు నారాయణతో పాటు కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డితో కూడిన 8 మంది బృందాన్ని తమ వాహనాల్లో తీసుకెళ్లి బ్యారేజీ కుంగిన ప్రాంతాన్ని చూపెట్టారు. ఈ సందర్భంగా నారాయణ విలేకరులతో మాట్లాడుతూ మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ పిల్లర్లు కుంగాయని, దీనికి సీఎం కేసీఆర్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. రూ. లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి మయమైందన్నారు. అనంతరం చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ త్వరగా నిర్మించిన ప్రాజెక్టు అంతే త్వరగా కూలిపోయిందని విమర్శించారు. దీని నిర్మాణం చేపట్టిన ఎల్‌అండ్‌టీ కంపెనీ కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్, పశ్యపద్మ, భుపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు రాజ్‌కుమార్, లక్ష్మణ్, సదానందం పాల్గొన్నారు.